సంపుటి :02 సంచిక :263 పేజీలు :06
వెల ₹5
# అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
శుక్రవారం 26, డిసెంబర్ 2025



## సీఎంను 'భీమవరం బుల్లోడు' అనాలా?

- రేవంత్ ఆంధ్రా నుంచి అల్లుడిని తెచ్చుకున్నారు..
- నేను గుంటూరులో చదివితే తప్పేంటి?
- ఆయన భాష చూస్తుంటే ఎడమకాలి చెప్పుతో కొట్టాలనిపిస్తోంది..
- సీఎం ఎనుముల రేవంత్ కాదు.. హామీల ఎగవేతల రేవంత్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

8

# మేడారం.. మహా అద్భుతం!



శాశ్వతంగా వనదేవతల గద్దెల పునర్నిర్మాణం

- 200 ఏళ్లు చెక్కుచెదరకుండా గ్రానైట్‌తో నిర్మాణం
- రూ.251 కోట్లతో అద్భుత ఆధ్యాత్మిక క్షేత్రంగా మేడారం
- 7 వేల శిల్పాల్లో ఆదివాసీల 900 ఏళ్ల చరిత్ర

తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ఇకపై సరికొత్త చరిత్రకు వేదిక కానుంది. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా రాష్ట్ర ప్రభుత్వం రూ.251 కోట్లతో చేపట్టిన శాశ్వత అభివృద్ధి పనులు మేడారం రూపురేఖలను మార్చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా సుమారు 4 వేల టన్నుల గ్రానైట్ రాయితో, 200 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా వనదేవతల గద్దెలను పునర్నిర్మిస్తున్నారు. 930 ఏళ్ల నాటి ఆదివాసీల తాళపత్ర గ్రంథాల్లోని విశేషాలను ఏడు వేల శిల్పాలుగా మలిచి గద్దెల ప్రాంగణాన్ని ఒక చారిత్రక కట్టడంగా తీర్చిదిద్దుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణలో సాగుతున్న ఈ పనుల పురోగతిని మంత్రి సీతక్క మీడియా బృందానికి వివరించారు. వచ్చే జనవరి 28 నుంచి జరిగే మహా జాతరలో భక్తులు సరికొత్త ఆధ్యాత్మిక అనుభూతిని పొందనున్నారు.

- అక్షర దర్బార్, మేడారం



## 28న కాంగ్రెస్ పార్టీ నిరసనలు

4

- ఉపాధి పథకం పేరు మార్పుపై అభ్యంతరాలు
- జాతిపిత గాంధీ పేరు తీసేయడంపై నిరసన కార్యక్రమాలు
- రాష్ట్ర స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఆందోళనలు

## భార్యపై పెట్రోల్ పోసి.. నిప్పంటించి



- అడ్డువచ్చిన కూతురిని కూడా మంటల్లోకి..
- తీవ్రగాయాల పాలైన తల్లీకూతుళ్లు
- భార్యపై అనుమానంతోనే భర్త ఘాతుకం

8



8

## రైతుభరోసా నిలిచిపోదు!

- పథకం ద్వారా రైతులకు ఆర్థిక సాయం అందుతూనే ఉంటుంది..
- కేవలం అనర్హులను ఏరివేసేందుకే జిల్లాస్థాయి కమిటీలు
- జాబితా నుంచి వెంచర్లు, ఫాంహౌస్‌లు, గుట్టల భూముల తొలగింపు
- సాగు చేసే ప్రతి రైతుకూ పెట్టుబడి సాయం
- కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే కొందరి ఫేక్ ప్రచారం
- రాష్ట్ర ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టత

అక్షర దర్బార్ Voice of the people



# ప్రపంచ చరిత్రలోనే ఒక మైలురాయి

- కనివిని ఎరుగని రీతిలో సమ్మక్క సారలమ్మ మహా జాతర నిర్వహణ
- శాశ్వతంగా 200 ఏళ్ళు నిలిచేలా సమ్మక్క సారలమ్మ గద్దెల పునర్నిర్మాణ పనులు
- మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి
- ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట
- ప్రతి నిర్మాణంలో సంస్కృతికి ప్రతిబింబించేలా చర్యలు
- 930 ఏళ్ల నాటి కోయల తాళపత్ర గ్రంథాల్లోని విశేషాలకు శిల్ప రూపం

అక్షరదర్బార్, మేడారం :
ప్రపంచ చరిత్రలోనే సమ్మక్క సారలమ్మ మహా జాతర నిర్మాణ పనులు ఒక మైలు రాయిగా నిలిచిపోతాయని, నిర్మాణ పనులు 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా చేపడుతున్నామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అనసూయ పేర్కొన్నారు. 4 వేల టన్నుల గ్రానైట్ పై ఆదివాసీ చరిత్ర సంస్కృతి తెలియజేసే 7,000 బొమ్మలతో సమ్మక్క సారలమ్మ నిర్మాణం పనులు వేగవంతంగా సాగుతున్నాయని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క సారలమ్మ పునర్ నిర్మాణం పనులు పరిశీలించేందుకు హైదరాబాదు నుంచి మీడియా ప్రతినిధుల బృందం వచ్చింది. సమ్మక్క సారలమ్మ చరిత్ర, పునర్నిర్మాణ నిర్మాణ పనులు, ఆదివాసీల మూలాలు, జాతర చరిత్రను మీడియా బృందానికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మేడారం సమ్మక్క– సారలమ్మ మహా జాతరను ఈసారి కొత్త రూపుతో వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. వచ్చే జనవరి 28 నుంచి 31 వరకు జరిగే జాతరకు తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కోటి మందికి పైగా భక్తులు తరలి వస్తారని అంచనా వేస్తున్నామని అన్నారు. ఈసారి ఎప్పుడూ కల్పించే తాత్కాలిక సౌకర్యాలతోపాటు శాశ్వత నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని, ఎన్నడూ లేనివిధంగా రూ.251 కోట్లతో మేడారం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ఇందులో ప్రధానంగా వనదేవతల గద్దెల విస్తరణ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని, ఈ పనులకే రూ.101 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు.

పునరుద్ధరణ పనులు చేపట్టే సమయంలో గిరిజన పూజారులతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి పూజారుల సంఘం అభిప్రాయం తీసుకుని పూజారులను ఒప్పించడం జరిగిందని, ఒకే లైన్లో వన దేవతలు ఉండడం వలన భక్తులు దర్శనాలు చేసుకోవడానికి సులువుగా ఉంటుందని పేర్కొన్నారు.  పూర్వకాలంలో గిరిజనులకు పసుపుతో ఎంతో బంధం ఉందని, శాస్త్రీయంగా పసుపుతో పలు వ్యాధులను నయం చేసుకునే అవకాశం ఉందని, దీనిని వాడకం చేయడం వలన పూర్వంలో ఆదివాసులు ఎలాంటి వ్యాధుల బారిన పడిన పసుపును వాడుకున్నారని తెలిపారు. సమ్మక్క తల్లి గోత్రం బండారి గోత్రమని, తమ ఆదివాసీల సాంప్రదాయం ప్రకారం ప్రతి పనిని కుడి నుండి ఎడమవైపు నడుస్తుందని, నవగ్రహాలు సైతం కుడి నుండి ఎడమవైపే తిరుగుతున్నాయని వివరించారు. స్వస్తిక్ ఏర్పాటు చేసే విషయంలో సైతం పకృతి సిద్ధాంతాన్ని ఆచరించామని పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులు ఒకే వరుస క్రమంలో సులభతరంగా దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జాతర కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా జరుపుతామని మంత్రి తెలిపారు.

చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఈసారి సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహిస్తున్నామని, భక్తులందరూ విజయవంతానికి కృషి చేయాలని సహకరించాలని కోరారు. ఆదివాసిల సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ ప్రతి నిర్మాణం చేపడుతున్నామని సంస్కృతి ప్రతిబింబించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆదివాసి పూజార్ల సంఘం ప్రతినిధుల ఆమోదంతోనే పునర్నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. చరిత్రలో సుమారు 250 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడ రాజీ పడకుండా పనులు చేపట్టేలా ప్రతినిత్యం సమీక్షిస్తున్నామని, నిత్యం మంత్రుల బృందం పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేస్తూ పనులు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయని త్వరలో పూర్తికానున్నాయని. తెలిపారు. గతంలో  రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా మేడారం సందర్శించారని తెలిపారు. ఆ సమయంలో ప్రజలు ఆదివాసీలు ఆలయాన్ని విస్తరించాలని కోరగా అధికారంలోకి రాగానే తప్పకుండా ఆలయాన్ని పునర్నిర్మిస్తామని మాట ఇచ్చి నేడు నిలుపుకుంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి రూ.251 కోట్లు మంజూరు చేశారని, మేడారం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని పనులను వేగవంతం చేస్తున్నారని, నిత్యం నిర్మాణం పనులను సమీక్ష చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హాయంలో తాత్కాలిక పనుల పేరిట నిధులను ఖర్చు చేశారని, ఇప్పుడు అలా కాకుండా ప్రభుత్వం పక్కా పకడ్బందీ వ్యూహంతో శాశ్వతంగా నిర్మాణ పనులు చేపడుతున్నదని చెప్పారు. చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో ఈ దఫా సమ్మక్క సారలమ్మ జాతరను నిర్వహిస్తున్నామని భక్తులంతా సహకరించాలని అన్నారు.

గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నామని. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుందన్నారు. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలుంటాయని వివరించారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున ప్రధాన స్వాగత తోరణం ఉంటుంధని తెలిపారు. వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

## - మంత్రుల బృందం ప్రతిరోజు సమీక్ష

మేడారం ఆలయంలో పునర్నిర్మాణ పనులు వేగవంతానికి మంత్రుల బృందం ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తున్నది. పనులను పరిశీలిస్తూ  అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నది. పనుల్లో పూర్తి నాణ్యత పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఏది అవసరం పడిన వెంటనే తెప్పిస్తున్నారు. అధికారుల పురమయిస్తూ పనులు వేగవంతానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రతి రోజు పనుల వేగవంతం పై అడిగి తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం పనులు తుది దశలో ఉన్నాయి. త్వరలో అన్ని పనులు పూర్తీ అవుతాయి.మంత్రుల బృందాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అధికారులకు ఆదేశాలిస్తూ ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారు. ఈసారి సమ్మక్క సారలమ్మ జాతరను బ్రహ్మాండంగా విజయవంతం చేసేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. మంత్రుల బృందం ప్రతిరోజు పనులను పర్యవేక్షిస్తూ వేగవంతం చేస్తున్నది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఈఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, స్థపతి శివనాజిరెడ్డి, మైపథి అరుణ్ కుమార్, పూజారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శిలలపై ఆదివాసీల సంస్కృతి పెద్దపీట వేస్తున్నాం : సీతక్క



శిలలపై ఆదివాసుల సంస్కృతికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణం గోడలపై చిహ్నాలుగా, బొమ్మలుగా వివరించారు. ప్రధాన స్వాగత తోరణంపై సమ్మక్క వంశీయుల చరిత్ర తెలిపే 59 బొమ్మలు చెక్కించామని పేర్కొన్నారు. దాదాపు 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించి ఏడు వేల బొమ్మలుంటాయని పేర్కొన్నారు. డాక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో 250 మంది శిల్పులు పనిచేశారని, స్థపతులు ఈమని శివనాగిరెడ్డి, డాక్టర్ మోతీలాల్ పర్యవేక్షిస్తున్నారనీ చెప్పారు  సమ్మక్క– సారలమ్మ ఆర్కియాలజీ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్కు చెందిన 15 మంది విద్యార్థులు ఈ చిత్రాల రూపకల్పనలో సాయం అందించారని పేర్కొన్నారు. గద్దెల ప్రాంగణానికి సమీపంలో ఇదివరకు ఉన్న చెట్లను దాదాపు తొలగించకుండానే అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వనదేవతల పూజల్లో విశిష్టత కలిగిన బండారి, మర్రి, వెదురు, బూరుగ, వేప, ఇప్ప, కస్తు వంటి 12 రకాల చెట్లు, 140 రకాల ఆయుర్వేద మొక్కలు నాటనున్నామని పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- బీఆర్ఎస్ లో చేరిన కాంగ్రెస్ కౌన్సిలర్



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో అమలైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. భూపాలపల్లి పట్టణ 3వ వార్డు మాజీ కౌన్సిలర్ పిల్లలమర్రి శారద నారాయణతో పాటు సేవాలాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజు శుక్రవారం కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో అర్బన్ ప్రెసిడెంట్ కటకం జనార్దన్ అధ్యక్షతన నిర్వహించిన పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, వరంగల్ మాజీ జెడ్పీ చైర్ పర్సన్, భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల ఆశలను నిరాశపరుస్తోందని, హామీలు అమలులో విఫలమైందని ఆరోపించారు. సింగరేణి కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని, వారి హక్కుల పరిరక్షణకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా సీపీఐ శతవసంతాలు

అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతవసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. గెస్ట్ హౌస్ ఆవరణలోని పార్టీ దిమ్మె వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీపీఐ పార్టీ స్థాపించి వంద సంవత్సరాలు గడిచినా ప్రజల్లో చెక్కుచెదరకుండా నిలిచిందని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. సీపీఐ ఆధ్వర్యంలో జనవరి 18న ఖమ్మంలో జరగనున్న భారీ బహిరంగ సభకు మహిళలు ఎర్ర చీరలు, పురుషులు ఎర్ర చొక్కాలు ధరించి పాల్గొనాలని, అలాగే సభ విజయవంతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కట్లరాజు, ఆదినారాయణ, బొల్లె నరసింహారావు, అప్పాల సత్యం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.







# అలరించిన 'చొప్పరి జోన్ సోషల్'

అక్షర దర్బార్, శాయంపేట: అంతర్జాతీయ లయన్స్ క్లబ్ 320ఎఫ్ వరంగల్ జిల్లా రీజియన్–4, జోన్–3 ఆధ్వర్యంలో నిర్వహించిన "చొప్పరి జోన్ సోషల్" కార్యక్రమం శుక్రవారం సభ్యులను విశేషంగా అలరించింది. శాయంపేట మండలం నేరేడుపల్లి గ్రామంలోని మామిడి తోటలో నిర్వహించిన ఈ సమావేశానికి జోన్ చైర్‌పర్సన్ లయన్ చొప్పరి సోమయ్య అధ్యక్షత వహించారు. జోన్ పరిధిలోని క్లబ్బులు చేపట్టిన సేవా కార్యక్రమాలపై వివరించారు. ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా గవర్నర్లు లయన్ ఎన్. సుధాకర్ రెడ్డి, లయన్ పి. హరికిషన్ రెడ్డి, పూర్వ జిల్లా గవర్నర్లు, జిల్లా క్యాబినెట్ సభ్యులు, వివిధ లయన్స్ క్లబ్బుల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్**



అక్షర దర్బార్, చిట్యాల : సోషల్ మీడియా ప్రభావం పెరిగిన నేపథ్యంలో విద్యార్థినులు సైబర్ నేరాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. మల్లేష్ యాదవ్ సూచించారు. శుక్రవారం స్థానిక తెలంగాణ సాంఘిక గురుకుల బాలికల పాఠశాల (పీఎం శ్రీ పాఠశాల) హాస్టల్ విద్యార్థినులకు సైబర్ క్రైమ్, విద్య ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిని క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తెలంగాణ పోలీస్ విభాగం నిర్వహిస్తున్న 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' ప్రచారంలో భాగంగా ఈ సదస్సు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యార్థినీలు అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, ఐడెంటిటీ థెఫ్ట్, సైబర్ స్టాకింగ్ వంటి నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డేటింగ్ యాప్‌లు, మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ బుల్లీయింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఏదైనా సైబర్ మోసం లేదా వేధింపులు ఎదురైతే భయపడకుండా వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, గోల్డెన్ అవర్‌లో స్పందిస్తే త్వరితగతిన న్యాయం జరుగుతుందని వివరించారు. అలాగే ఆన్‌లైన్ గేమింగ్, తెలియని వెబ్‌సైట్ల నుంచి వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని కోరారు. కార్యక్రమంలో చిట్యాల ఎస్సై ఈశ్వరయ్య, కానిస్టేబుళ్లు లాల్ సింగ్, సురేష్, పాఠశాల ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి, ఉపాధ్యాయులు శాంత శ్రీ, దివ్యతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థినీలు పాల్గొన్నారు.


# 'చల్లా' శుభాకాంక్షలు

అక్షర దర్బార్ ,పరకాల: నడికుడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో ఇటీవలే నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మేకమల్ల వెంకటేష్,వార్డు సభ్యులు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హన్మకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సర్పంచ్, వార్డు సభ్యులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



# వెలుతుర్లపల్లి సర్పంచ్ శారదకు ఘన సన్మానం

అక్షర దర్బార్, వెంకటాపూర్: వెలుతుర్లపల్లి గ్రామ సర్పంచ్ బొజ్జ శారద జగన్మోహనరావును ఆమె పూర్వ విద్యార్థి స్నేహితులు ఘనంగా సన్మానించారు. జిల్లాలోని మంగపేట మండలం రాజుపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986–87 విద్యా సంవత్సరంలో పదో తరగతి వరకు చదువుకున్న శారదతో కలిసి అప్పటి బ్యాచ్‌కు చెందిన సహచరులు ఈ సందర్భంగా సర్పంచ్ గా ఎన్నికైన శారదను సన్మానించారు. తమ తోటి స్నేహితురాలు గ్రామ సర్పంచ్‌గా గెలిచి ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోర్తాల సిద్ధారెడ్డి, ముమ్మిడి రాంబాబు, నలుకుర్తి వెంకటలక్ష్మి , గూడపాటి కనకదుర్గ, సోమ లీలావతి, బొజ్జ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ అభివృద్ధికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు పథకాలు



అక్షర దర్బార్, చిట్యాల : గ్రామీణ ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంచి అభివృద్ధికి దోహదపడేలా చిట్యాల మండలం ఒడితల గ్రామపంచాయతీ ప్రాంగణంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాబార్డ్ ఆర్థిక అక్షరాస్యత నిధుల సహకారంతో ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ ప్రేమ్ కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సురక్ష బీమా యోజన కింద ఏడాదికి రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా, జీవన్ జ్యోతి బీమా యోజనలో ఏడాదికి రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షల జీవిత బీమా లభిస్తుందని తెలిపారు. జన్‌ధన్ ఖాతా ద్వారా జీరో బ్యాలెన్స్ తో ఉచిత ఖాతా, విద్యార్థులకు ఎడ్యుకేషన్ లోన్లు, రైతులకు వ్యవసాయ రుణాలు, వాహన రుణాలపై వివరించారు. రుణాలు సకాలంలో రీన్యువల్ చేయించుకుంటే కేంద్రం నుంచి 3 శాతం వడ్డీ రాయితీ లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి భగవాన్ గౌడ్, ఉప సర్పంచ్ కాంపల్లి శ్రీకాంత్, బ్యాంకు అధికారులు, బ్యాంకు మిత్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చిన్నారులను ఆశీర్వదించిన నాగూర్ల

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామానికి చెందిన నాగూర్ల విక్రమ్–హాసిని దంపతుల కుమార్తె నామకరణం, కుమారుడు హవీషిత్ పంచె కట్టించుట కార్యక్రమం శనివారం గ్రామంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వరికేల కిషన్ రావు, నాగూర్ల సంతోష్, కోడపాక ఐలయ్య, లోనే సతీష్, సురావు శివరావు, ముర్తాల దేవేందర్, రాకేష్ ప్రభు, భాస్కర్, వరికేల రాజు, సూరవు బాబురావు తదితరులు పాల్గొన్నారు.






## హోటల్ అశోక వసంతోత్సవాలు

- ఆతిథ్య రంగంలో 40 ఏళ్ల విశిష్ట సేవల సంబరాలు
- ఈనెల 31 వరకు 10 శాతం డిస్కౌంట్

అక్షరదర్బార్, హనుమకొండ: ట్రైసిటీ నడిబొడ్డున ఉన్న హోటల్ అశోకా ఇప్పుడు 40 ఏళ్ల వసంతోత్సవాలు జరుపుకుంటోంది. ఓరుగల్లు సంస్కృతి సంప్రదాయాలతో అతిథి సేవలో హోటల్ అశోకా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. దేశాధినేతలు, ప్రధానులు, పలువురు ముఖ్యమంత్రులు, మంత్రులు ఉన్నతాధికారులు, రాజకీయ, పారిశ్రామిక రంగాలకు చెందిన అనేక మంది ఈ హోటల్‌లో ఆతిథ్యం పొందినట్లు అశోకా యాజమాన్యం పేర్కొంది. పరిశుభ్రతే పరమావధిగా, రుచి శుచికరమైన భోజనం, విలాసవంతమైన గదులకు చిరునామా హోటల్ అశోకా అని, ఓరుగల్లు ప్రాంతంలోని చారిత్రక కట్టడాలు, ఆలయాలు దర్శించుకోవాలంటే హనుమకొండకు రావాల్సిందేనని, హోటల్ అశోకా ఆతిథ్యం పొందాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 16 నుంచి 31 వరకు రూమ్ బుకింగ్, ఫుడ్, లిక్కర్‌పై 10 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## రేకంపల్లిలో ఘనంగా పడిపూజ



అక్షర దర్బార్, దుగ్గొండి : దుగ్గొండి మండలం రేకంపల్లి గ్రామంలో సీనియర్ జర్నలిస్టు వంగాల సునీత–ప్రేమ్ సాగర్ రెడ్డి దంపతులు అయ్యప్పస్వామికి ఘనంగా అభిషేకాలు, పడిపూజ నిర్వహించారు. శుక్రవారం వారి స్వగృహంలో నిర్వహించిన అయ్యప్పస్వామి పూజా కార్యక్రమాలు, అష్టాభిషేకాలు భక్తుల మనసులను ఆకట్టుకున్నాయి. నర్సంపేట శ్రీ ధర్మశాస్తా అయ్యప్పస్వామి దేవాలయ గురుస్వాములు బొట్ల నాగరాజు, వల్లాల అంకూస్ గౌడ్ మంత్రోచ్చరణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి నామస్మరణ, భజనలతో పరిసరాలు భక్తిభావంతో నిండిపోయాయి. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొని స్వామి ఆశీస్సులు పొందారు.

## దోపిడి రహిత సమాజమే సీపీఐ లక్ష్యం

**ఆపార్టీ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి**




అక్షర దర్బార్, కేసముద్రం: దోపిడి, అంతరాలు లేని సమాజ నిర్మాణమే సీపీఐ ప్రధాన లక్ష్యమని జిల్లా కార్యదర్శి బి. విజయసారథి తెలిపారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కేసముద్రం మండల కేంద్రంలో జ్యోతిరావు పూలే సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ స్థాపించబడిందని గుర్తు చేశారు. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి సంపూర్ణ స్వాతంత్రం సాధించేందుకు కమ్యూనిస్టు పార్టీ కీలక పాత్ర పోషించిందని, కార్మికుల హక్కులు, విద్య–వైద్యం, ఉపాధి అవకాశాల కోసం నిరంతరం పోరాటం చేసిందని అన్నారు. హైదరాబాద్ సంస్థానం విలీన పోరాటాల్లోనూ సీపీఐకి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తూ ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తోందని ఆరోపించారు. రానున్న రోజుల్లో ఈ విధానాలపై సమరశీల ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే సీపీఐ శతజయంతి ఉత్సవాల ముగింపు బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి

## చిట్యాల మండల అధ్యక్షుడిగా గొర్రె అనిల్ యాదవ్

అక్షర దర్బార్, చిట్యాల : జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి చిట్యాల మండల అధ్యక్షుడిగా నైన్ పాక గ్రామానికి చెందిన గొర్రె అనిల్ యాదవ్ ను నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పంచిక మహేష్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా జూనువాల వివేక్ యాదవ్ ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దొంగల రాజేందర్, యూత్ అధ్యక్షులు బియ్యాన్ని పూర్ణ చందర్ బాపు అనిల్ గోదుగు సున్ని తదితరులు పాల్గొన్నారు



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలం గిద్దెముత్తారం ఎస్సీ కాలనీలో ఇటీవల మరణించిన మారపెల్లి సారయ్య కుటుంబానికి మాజీ ఎంపీటీసీ పప్పుల విజయలక్ష్మి సంజీవయ్య ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పోలవేణ పోశాలు, 8వ వార్డు సభ్యులు మోరే జ్యోతి–రవీందర్ 25 కిలోల బియ్యం అందజేశారు. అలాగే ఆకుల చేరాలు, పంచిక సురేష్, పంచిక మహేష్, మోరే సురేందర్, బందెల శ్రీను, మారపెల్లి సిద్ధూ, రమేష్, వాసాల ప్రభాకర్, మోరే శంకర్, కాశిపాక సాంబి, బందారి రాజు, మోరే రియాజ్, మారపెల్లి ఆకాష్, కనుకం రాజపోషం తదితరులు తమ వంతు ఆర్థిక సహాయం చేశారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు నివాళి



అక్షర దర్బార్, పరకాల: భారత మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పరకాల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ నేతృత్వంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి స్మరించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నడికూడ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, నడికూడ గ్రామ సర్పంచ్ కుడ్ల మలహరావు, సమన్వయ కమిటీ సభ్యులు ఒంటేరు శ్రావణ్ కుమార్, మార్క రఘుపతి గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, బొచ్చు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 28న కాంగ్రెస్ పార్టీ నిరసనలు

- ఉపాధి పథకం పేరు మార్పుపై అభ్యంతరాలు
- జాతిపిత గాంధీ పేరు తీసేయడంపై నిరసన కార్యక్రమాలు
- రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా, మండల, గ్రామస్థాయి వరకు ఆందోళనలు

అక్షరదర్బార్, వరంగల్: కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) పేరును వీబీ– జీ రామ్ జీ మారుస్తూ తీసుకున్న నిర్ణయంపై తెలంగాణలో రాజకీయ దుమారం రేగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తన నిరసన గళాన్నికేంద్ర ప్రభుత్వానికి వినిపించేందుకు ఈ నెల 28వ తేదీన రాజధాని హైదరాబాద్‌తో పాటు జిల్లా, మండల, గ్రామస్థాయిలో ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించింది. కేంద్రం ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (వీబీ–జీ–రామ్ జీ) బిల్లు ద్వారా జాతిపిత పేరును తొలగించడంపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. 2006లో ప్రారంభమై 2009లో మహాత్మా గాంధీ పేరును జోడించుకున్న ఈ చట్టం గ్రామీణ పేదలకు కల్పవృక్షంలా మారిందని, ఇప్పుడు ఆ పేరును తొలగించడం అంటే గాంధీజీ ఆశయాలను అవమానపరచడమేనని పార్టీ నాయకులు మండిపడుతున్నారు. కొత్త బిల్లులో పని దినాలను 125 రోజులకు పెంచినప్పటికీ, పేరు మార్పు వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ మేరకు పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

# డీసీసీ కార్యవర్గంపై కసరత్తు

- రంగంలోకి టీపీసీసీ పరిశీలకులు గాజర్ల అశోక్, దుర్గం భాస్కర్
- జనవరి 1 వరకు క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ
- సామాజిక సమీకరణలు, క్లీన్ ఇమేజ్ కే పెద్దపీట

అక్షరదర్బార్, మేడ్చల్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యవర్గ కూర్పుపై అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా, అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా నూతన కమిటీని రూపొందించేందుకు టీపీసీసీ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు ఇద్దరు పరిశీలకులను నియమించారు.

– రంగంలోకి పరిశీలకుల బృందం

రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ (ఐతు), రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్ పరిశీలకులుగా జిల్లాలో పర్యటిస్తున్నారు. బుధవారం జిల్లాకు చేరుకున్న ఈ బృందం, గురువారం నుంచి జనవరి 1 వరకు ఉప్పల్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో పర్యటించనుంది. డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, ఆయా నియోజకవర్గాల ఇంచార్జ్‌లు, ముఖ్య నేతలతో భేటీ అయి క్షేత్రస్థాయిలో అభిప్రాయాలను సేకరించనున్నారు.

**- అధిష్ఠానం కఠిన మార్గదర్శకాలు**

కార్యవర్గ ఎంపికలో టీపీసీసీ కొన్ని కీలక నిబంధనలను విధించింది. నేరచరిత్ర ఉండకూడదు. రాజకీయ పోరాటాల్లో నమోదైన కేసులు మినహా హత్య, గృహహింస, డ్రగ్స్, ఆర్థిక నేరాలు వంటి తీవ్ర క్రిమినల్ కేసులు ఉన్నవారిని కమిటీలోకి తీసుకోవద్దని స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సముచిత స్థానం కల్పించాలి. జిల్లా కమిటీలోని అన్ని స్థాయిల్లో మహిళలకు 20 నుంచి 25 శాతం వరకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించింది.

**- జనవరిలో తుది జాబితా**

**పరిశీలకులు.. గాజర్ల అశోక్**

ఇప్పటికే జిల్లా రాజకీయ పరిస్థితులపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌తో ప్రాథమికంగా చర్చించారు. వారం రోజుల పాటు సాగే ఈ అభిప్రాయ సేకరణ అనంతరం, నివేదికను పీసీసీకి సమర్పించనున్నారు. పీసీసీ చీఫ్ ఆమోదంతో జనవరి మాసంలో మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాకు నూతన కార్యవర్గం కొలువు దీరనుంది.

# సీఎంను 'భీమవరం బుల్లోడు' అనాలా?


- రేవంత్ ఆంధ్రా నుంచి అల్లుడిని తెచ్చుకున్నారు..
- నేను గుంటూరులో చదివితే తప్పేంటి?
- ఆయన భాష చూస్తుంటే ఎడమ కాలి చెప్పుతో కొట్టాలనిపిస్తోంది..
- సీఎం ఎనుముల రేవంత్ కాదు.. హామీల ఎగవేతల రేవంత్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



అక్షరదర్బార్, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును తప్పుబడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'భీమవరం బుల్లోడు' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శేరిలింగంపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు శుక్రవారం కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాను గుంటూరులో చదివితే తప్పేంటి అంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. తన అల్లుడిని ఆంధ్రాలోని భీమవరం నుంచి తెచ్చుకున్న విషయాన్ని మర్చిపోవద్దని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఏఐసీసీ అగ్రనాయకులు సోనియాగాంధీ, ప్రియాంక గాంధీపై ఒట్టు పెట్టి ఇచ్చిన హామీలను సీఎం తుంగలో తొక్కారని మండిపడ్డారు. ఆయన ఎనుముల రేవంత్ రెడ్డి కాదని, హామీలు ఎగ్గొట్టే 'ఎగవేతల రేవంత్ రెడ్డి' అని అభివర్ణించారు. కేసీఆర్‌ను తిట్టడం, చావాలని కోరుకోవడం వంటివి విడనాడి, మహిళలకు తులం బంగారం, నెలకు రూ.2,500లు ఇస్తానని శపథం చేయాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కూల్చివేతలు, భూ కబ్జాలకే పరిమితమైందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఢిల్లీకి సంచులు మోస్తూ తెలంగాణ పౌరుషాన్ని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ ఒక్క ప్రెస్ మీట్ పెడితేనే కాంగ్రెస్ నేతలకు చలిజ్వరం మొదలైందని, మళ్ళీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసే వరకు తమ పోరాటం ఆగదని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వాడుతున్న అసభ్యకర భాషను చూస్తుంటే ఒక్కోసారి ఎడమకాలి చెప్పుతో కొట్టాలనిపిస్తుందని కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేవలం ముఖ్యమంత్రి పదవి మాత్రమే ఆయన్ని కాపాడుతోందని పరోక్షంగా హెచ్చరించారు. పరిపాలన పక్కనబెట్టి రెండేళ్లుగా కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పేమెంట్ కోటాలో సీఎం అయ్యారని, ఢిల్లీకి మూటలు మోయడం తప్ప ఆయనకు ఏమీ తెలియదని విమర్శించారు. తెలంగాణ హక్కుల గురించి కేసీఆర్ అడిగితే సమాధానం చెప్పలేక బూతులు తిడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్‌ను కొడంగల్‌లో గెలవకుండా చేస్తామని, రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# భార్యపై పెట్రోల్ పోసి.. నిప్పటించి

- అడ్డు వచ్చిన కూతురిని కూడా మంటల్లోకి..
- తీవ్రగాయాల పాలైన తల్లీకూతుళ్లు
- భార్యపై అనుమానంతోనే భర్త ఘాతుకం



అక్షరదర్బార్, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి చేసిన కిరాతక చర్య స్థానికంగా కలకలం రేపింది. నల్లగొండ జిల్లాకు చెందిన వెంకటేశ్, త్రివేణి ప్రేమించి పెళ్లి చేసుకోగా వీరు ప్రస్తుతం హైదరాబాద్‌లోని తిలక్‌నగర్ బస్తీలో నివాసం ఉంటున్నారు. భార్య హోటల్ పని ముగించుకుని ఇంటికి రావడం ఆలస్యమైతే అనుమానంతో వేధించే వెంకటేశ్, మంగళవారం అర్ధరాత్రి నిద్రిస్తున్న త్రివేణిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ క్రమంలో మంటలార్పేందుకు ప్రయత్నించిన తన సొంత కూతురిని కూడా నిందితుడు మంటల్లోకి తోసేయడం అక్కడి గూబేలియా వీడియోలలో రికార్డ్ అయి విస్తుగొలిపింది. అతి కష్టం మీద బాలిక ప్రాణాలతో బయటపడగా, తీవ్రంగా గాయపడిన త్రివేణి పరిస్థితి విషమంగా ఉంది. నిందితుడు ఈ దారుణానికి ఒడిగట్టిన వెంటనే అక్కడి నుంచి పరారు కాగా, పోలీసులు గాలింపు చేపట్టి కేవలం గంటల వ్యవధిలోనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. త్రివేణిని పుట్టింటి నుంచి మార్పు చెందుతానని నమ్మబలికి తీసుకొచ్చి మరీ హత్యాయత్నానికి పాల్పడటం గమనార్హం.

# పేదలకు కళ్యాణలక్ష్మి వరం



అక్షర దర్బార్, చిట్యాల : నిరుపేద కుటుంబాల ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు వరమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం చిట్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన మొత్తం 153 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.53,17,748 నిధుల చెక్కులను ఎమ్మెల్యే జీఎస్ఆర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా, ప్రజాపాలన ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారులు, సునీతరెడ్డి, విజయలక్ష్మి, చిట్యాల ఆర్ఐ రాజేందర్, చిట్యాల సర్పంచ్ తౌటం లక్ష్మి, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి పాల్గొన్నారు.

# రేపు మానుకోటకు మంత్రి పొంగులేటి



అక్షరదర్బార్, మహబూబాబాద్: రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం మహబూబాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 6:30 గంటలకు ఆయన హైదరాబాద్ హిమాయత్ సాగర్ లోని తమ ఇంటి నుంచి బయలుదేరుతారు. 9:30 గంటలకు మరిపెడ మండల కేంద్రం చేరుకుని సీసీ డ్రెయిన్, 9.45 గంటలకు బీటీ రోడ్డు, 10 గంటలకు బీటీ రోడ్డు విస్తరణ, డ్రెయిన్, 10.15 గంటలకు రామ్ విలాస్ స్ట్రీట్ లో సీసీ, డ్రైయిన్ ను ప్రారంభిస్తారు. అనంతరం మరిపెడ నుంచి బయలుదేరి 10 45 గంటలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కురవి మండల కేంద్రానికి చేరుకుంటారు. ఇక్కడ ఆయన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత 11.10 గంటలకు మహబూబాబాద్ పట్టణానికి చేరుకుంటారు. ఇక్కడ 11:45 గంటలకు ఆర్ సీ కన్వెన్షన్ లో జరిగే కొత్త సర్పంచుల సన్మాన కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. 12.15 గంటలకు డోర్నకల్ మండల కేంద్రం చేరుకొని బతుకమ్మ చెరువు వద్ద మినీ ట్యాంక్ బండ్ ప్రారంభిస్తారు. 12:30 గంటలకు డోర్నకల్ లో బీటీ రోడ్డు, స్మార్ట్ డ్రైన్ పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం మంత్రి పొంగులేటి పర్యటన కోసం ఏర్పాట్లు చేపట్టింది.

# రైతుభరోసా నిలిచిపోదు!

- పథకం ద్వారా రైతులకు ఆర్థిక సాయం అందుతూనే ఉంటుంది..
- కేవలం అనర్హులను ఏరివేసేందుకే జిల్లాస్థాయి కమిటీలు
- జాబితా నుంచి వెంచర్లు, ఫాంహౌస్‌లు, గుట్టల భూముల తొలగింపు
- సాగు చేసే ప్రతి రైతుకూ పెట్టుబడి సాయం
- కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే కొందరి ఫేక్ ప్రచారం
- రాష్ట్ర ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టత

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: తెలంగాణలో రైతు భరోసా పథకాన్ని రాష్ట్రప్రభుత్వం నిలిపివేస్తుందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని సర్కార్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం శుక్రవారం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. సాగు చేయని రైతులకు పథకం వర్తించదని కొందరు, అసలు పథకం పూర్తిగా ఆగిపోతుందని మరికొందరు సోషల్‌మీడియాలో ఫేక్ ప్రచారం చేస్తున్నారని, ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని తేల్చి చెప్పింది. రైతులు అలాంటి అసత్య వార్తలను నమ్మి ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేసింది. రాజకీయ ప్రయోజనాలమే కొందరు సర్కార్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వారి ప్రచారాన్ని పట్టించుకోవద్దని ప్రభుత్వం కోరింది.

## - ఫేక్ వార్తలపై స్పష్టత

రైతుభరోసా పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా సుమారు 65 లక్షల మంది రైతులు ప్రయోజనం పొందుతున్నారని, ఈ పథకాన్ని ఆపివేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని ఫ్యాక్ట్‌చెక్ విభాగం స్పష్టం చేసింది. సర్కార్ ప్రస్తుతం లబ్ధిదారుల జాబితాను పరిశీలిస్తోందని, త్వరలో జాబితా ఫైనల్ చేస్తోందని తెలిపింది. నిజమైన రైతులకు మాత్రమే ప్రభుత్వ సాయం అందాలనే లక్ష్యంతోనే సర్కార్ జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసిందని, ఆయా కమిటీలు క్షేత్రస్థాయికి వెళ్లి నిజమైన లబ్ధిదారులను గుర్తించే పనిలో పడ్డాయని పేర్కొంది. రాష్ట్ర ఆర్థికశాఖ కూడా పథకానికి నిధులు విడుదల చేసేందుకు కసరత్తు ప్రారంభించిందని స్పష్టం చేసింది.

## - శాటిలైట్ మ్యాపింగ్ ప్రక్రియ

వాణిజ్య అవసరాల కోసం వినియోగిస్తున్న భూములను గుర్తించేందుకు ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నదని ఫ్యాక్ట్ చెకింగ్ విభాగం పేర్కొంది. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జర్మన్ టెక్నాలజీతో శాటిలైట్ మ్యాపింగ్ నిర్వహిస్తున్నదని తెలిపింది. దీనివల్ల సాగు భూమి ఏది.. రియల్ ఎస్టేట్ వెంచర్లు ఎక్కడ ఉన్నాయో స్పష్టంగా తెలుస్తుందని తెలిపింది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న వేల ఎకరాల వాణిజ్య భూములకు గతంలో అక్రమంగా రైతుభరోసా అందిందని ప్రభుత్వం గుర్తించింది. ఇలాంటి అనర్హులను తొలగించడం కోసమే కసరత్తు జరుగుతున్నదని తేల్చిచెప్పింది. కేవలం సాగు చేసే రైతులకే ఆర్థిక సాయం అందాలనేది రాష్ట్రప్రభుత్వం అభిమతమని పేర్కొంది. సాగుకు వీలులేని కొండలు, గుట్టలు, రోడ్లు, ఫాంహౌస్‌లకు సాయం అందకుండా సమగ్ర చర్యలు తీసుకుంటున్నదని తెలిపింది.

## - రైతులు అభ్యంతరాలు తెలపొచ్చు..

రైతులు తమ సందేహాల నివృత్తి చేసుకునేందుకు రాష్ట్రప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తున్నది. రైతుభరోసా జాబితాలో తమ పేర్లు లేవని గుర్తించిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులు వెంటనే తమ అభ్యంతరాలను కలెక్టరేట్ లేదా రెవెన్యూశాఖ కార్యాలయాలకు వెళ్లి సరైన ఆధారాలు సమర్పించాలని సర్కార్ సూచించింది. ఆధారాలు పరిశీలించిన తర్వాత సర్కార్ నిజమైన రైతులను జాబితాలోకి చేరుస్తుందని తెలిపింది. గతేడాది కేవలం 9 రోజుల్లోనే ప్రభుత్వం రైతు భరోసా పంపిణీని పూర్తి చేసి రికార్డు సృష్టించిందని గుర్తుచేసింది. గతేడాది లాగానే.. ఈసారి కూడా అర్హులైన ప్రతి రైతుకు ఆర్థికసాయం అందుతుందని హామీ ఇచ్చింది.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : aksharadarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915